# చరమాంకం

## షర్మిళ

"తెల్లగా తెల్లారింది ఇంకా నిద్దళ్ళేంటి లెగండి! లెగండి!" తాత కేకలేస్తన్నాడు. ఆ వెంటనే ఇంకో గొంతు ఖంగుమంటూ మోగింది. అది అమ్మది. "చీకూ చింతా లేకుండా ఇప్పుడేగా పడుకునేది. రేపు పెద్దయ్యాకా ఎట్టాగూ తప్పదు. అయినా మీ కెందు కొచ్చిన గోల 'కృష్ణా! రామా!' అంటూ ఓ మూల కూచ్చోక" తాత గురించి ఏమ్మాట్టాడినా ఆ కృష్ణా రామా అన్న ముక్క చేరుస్తుంది అమ్మ. ఆయన పాలేళ్లని 'కాస్త గొడ్లచావిడి శుభ్రం చెయ్యండ్రా. ఇంత లోతున వుంది' అన్నాడనుకోండి, అమ్మ అందుకుంటుంది-

"చాలుచాల్లే చెప్పొచ్చావు. ఆళ్లకి బోల్డు పనులుండయ్యి! ఇంకా గేదలు సాయంత్రానికి గదా ఇంటికి చేరేది అయినా కృష్ణా!రామా...." అంటూ సాగదీస్తుంది.

తాత ఏమ్మాట్టాడినా అమ్మకి అంతకోపం ఎందుకో? తాతను చూస్తే నాకు మాత్రం జాలేస్తుంది. ఆ మాటే అంటే "అమ్మో మీ తాత ఏం తక్కువాడు కాదు. 80 ఏళ్లు వచ్చినయ్యి కాబట్టి కన్నూకాలూ పన్జెయ్యక అట్టా పడుండాడు. నేను కావరానికి వచ్చింది మొదలు నాలుగైదేళ్ల కిందటి వరకూ మీ తాతంటే గడగడలాడేదాన్ని. తాచుపామల్లే బుసలు కొట్టేవాడు. నచ్చి ఏ లోకానుందో నా అత్త, ఆమి మాత్రం ఈయనంటే వణికిపోయేది కాదూ! నుంచోనిచ్చాడా, కూచ్చోనిచ్చాడా? తను చెప్పిందే వేదం, ఇంకా ఎన్నాళ్లు సాగిస్తాడు" అమ్మ అన్నీ చిత్రంగా మాట్లాడుతుంది.

అత్త గురించి చెప్పేటప్పుడు ఆమె పెట్టిన ఆరళ్లు చెప్తుంది. తీరా మావ దగ్గరికి వచ్చేసరికి చచ్చిపోయిన అత్తగారి కష్టాలు తల్చుకుని బాధపడుతుంది. 'పోన్లే అమ్మా! తాత ఎప్పుడో అట్టా వుండేవాడు. ఇప్పుడు అట్టా లేడుగా' అని సర్దిచెప్తే 'నిజవేలే నాకు మాత్రం శత్రువా!' అని వూరుకుంటుంది.

అమ్మా నాన్న ఆవాళ ఊరికి ప్రయాణంకట్టారు. అమ్మ పెద్దమ్మ మనవరాలి పెళ్లికి. తాతను, నన్నూ ఇంటి దగ్గరే వదిలేసి బయల్దేరారు. ఈ సమాచారం తాతకి ప్రత్యేకంగా ఏం అందలేదు కానీ జరిగే హడావిడి అంతా వసారాలో నవ్వారు మంచం మీద పడుకొని ఓరకంట చూస్తూనే వున్నాడు.

"రాముడూ! ఆ కొబ్బరికాయలు వలిచి బుట్టలో పెట్టు, ఇదిగో సూరమ్మక్కాయి వెన్నపూస ఇస్తానంది తే! మర్చిపోయారోయ్, ఉలవనీళ్లకి మునసబుగారింటికి క్యాను పట్టికెళ్లు" అంటూ కిందామీదా పడి దగ్గర దగ్గర ఎడ్లబండి తొట్టికి సరిపడా సామాను సర్దింది. బండి కట్టుకొచ్చాక అమ్మ నాకు అప్పగింతలు మొదలెట్టింది.

"నువ్వు ఆ సీతని, కోతిమూకని ఇంట్లో చేరబెట్టబాకు, మర్చిపోయా! రాముడు పాలు తేగానే ఒక లీటరు కొలిచి ఇంట్లో వాడుకొని మిగతా మూడు లీటర్లు పాలకేంద్రానికి రాముడ్ని పోసిరమ్మను. పాలు పొంగబెట్టబాకు"

ఇంకా చెప్తుండగానే నాన్న కసురుకున్నాడు. 'ఇక బయల్దేరతావా! సోది చెబుతా కూచ్చుంటావా?' అని.

అమ్మ బండి పొలిమేర దాకా వెళ్లే వరకూ ఘల్లు ఘల్లు మంటూ ఎడ్ల మువ్వల చప్పుడు వినిపిస్తూనే వుంది అమ్మ మాటల గలగలలాగానే.

అమ్మ పూర్తిగా వెళ్లిందని రూఢి చేసుకున్నాక తాత పిలిచాడు. "ఏంటి తాతా!" అన్నాను.

"ఏం లేదే తల్లీ! ఇవ్వాళకి మీ అమ్మ వంటచేసి పెట్టి వెళ్లిందికదా! రేపు మనం ఏం వండు కుందాం?" అన్నాడు.

"ఏదో ఒకట్లే తాతా! దొడ్లో పాదులకి వంకాయిలుండయ్యి వేపుడు చేస్తాను, లేకపోతే గోంగూర పప్పు వండుతాలే" అన్నాను.

"కాదే! కోడిని కోసుకుందాం" అన్నాడు తాత. పక్కలో బాంబు పేలినంత పనయ్యింది నాకు.

"ఏంటితాతా! నువ్వు అనేది? అమ్మ బతకనిస్తందా మనని! అసలే కోళ్లన్నీ లెక్కపెట్టుకుని మరీ వెళ్లింది. ఏనాడో చుట్టమో పక్కమో వస్తే నే చూసి చూసి అరకోడి కోస్తంది. అట్టాంటిది ఊరుకుంటందా?" అనేశాను.

"అంతగా అయితే ఏ కుక్కో పిల్లో ఎత్తుకుపోయిందని చెబుదాంలేవే, శాన్నాళ్లయ్యింది తిని" తాత నోరు చప్పరించాడు.

"సర్లే తాతా! రేపు వండుకుందాంలే. ఆ రాముడు గేదలు పొలానికి తోలుకెళ్లాక వండుకుందాం, లేక పోతే అమ్మకి చెప్పేస్తాడు" అన్నా.

"సరేసరే! నే చూసుకుంటాగా" అన్నాడు తాత సంబరపడిపోతూ. ఆ మర్నాడు బుట్టకింద దాచిన నల్లకోడిపెట్టని గుట్టు చప్పుడు కాకుండా కోశాం. అసలే నాకు వంటరాదు. పైగా మూడోకంటికి తెలీకుండా వండాలి. ఎట్టాగో వండేశాను.

"వాసన బాగానే వస్తాందే" తాత వసారా లోంచి ముక్కు ఎగబీలుస్తూ అన్నాడు.

"తాతా! నేను ట్యూషన్ నించి వచ్చి తింటాగానీ నీకు అన్నీ అక్కడపెట్టాను, తినెయ్యి" అని చెప్పి పరిగెత్తాను.

ట్యూషన్ నుంచి వచ్చి నేనూ అన్నంపెట్టుకుని కూర కలిపి ముద్ద నోట్లో పెట్టుకున్నాను, అంతే! వాంతొచ్చినంత పనయ్యింది.

ఉప్పు కసిం! హడావిడిలో రెండుసార్లేశానో ఏంటో? అనలు వండిన నేనే ఒక ముక్కా నోట్లో పెట్టలేకపోయా. మజ్జిగపోసుకుని తినేసి తాత దగ్గరికి వెళ్లా. వసారాలో నవ్వారు మంచంమీద తాత కునుకుతీస్తున్నాడు.

"తాతా!" అనగానే "ఏంటమ్మా! వచ్చేశావా! పొద్దెక్కింది అన్నం తిను" అన్నాడు.

"ఉప్పుకసిం అయిపోయింది గదా! ఆ కూర ఎట్టా తిన్నావు తాతా!" నాకే తెలీదు నాకు ఏడుపు ఎప్పుడొచ్చిందో! గొంతు పెగలడం లేదు.

"ఏమ్మా! బాగానే వుందికదే. శుబ్బరంగా తిన్నా. చూడు పొట్ట ఎంతొచ్చిందో " అన్నాడు తాత బొజ్జ నిమురుకుంటూ. ■



చరమాంకం అనేది జీవితంలో
బాధాకరమైన అనుభవం.
దానికి రంగు, రుచి, వాసనా వుండవు.
గతం తాలూకు తలపోతలూ,
వాటి వల్ల కలిగే ఫలితాలు
మిగులుతాయి.
వాటిని పంటి బిగువున
భరించక తప్పదు.